# సుఖాంతం

మూ(డ్రోల కాడ్నుండి జిడ జిడవని సినుకు - వుండుండో జెల్లు - పేణాలు కొరికేస్తంది వోన. కార్తీకం యెల్లిపోయి, మారిగిసిరం పారొచ్చింది గదా-మరి సలి కూడా పారొచ్చింది. వుండుండొక్కపాలి జివ్వున కొట్టి పారెస్తంది సలి. సంపనానికి వోన సాలనట్టు దీని జివ్వడ- ఈ సలికేటి సావొచ్చిందో గాని - దబ్బునంతో పొడిసీసిట్టు సాలొస్తంది.

పాపిగాడిగ్గాని, ఆడి పెల్లానిగ్గాని ఈ మూ(డ్రోల కాడ్నుండి పట్టిడు గింజలేనా పుట్టనేదెక్కడా. పోనెర్రగా ఎండగానొస్తే - ఎవులిల్లకడేనా బోయినాలేళప్పు డరిసి గోలెడితే - బుక్కడు గెంజినీళ్లు పొయ్యకపోరు. వోనిలా తినేస్తుంది గదా- ఎవుడింటి కెళ్లి గెంజినీళ్లడగడం - ఎవడు పోస్తాడు! పెతివోళ్లూ సలికీ, ఓనకీ జెడిస్పోయి గావాల తలుపులు గడిలెట్టేసి తొంగున్నారిళ్లల. మరెలా సావడం, ఎందల బడిపోడం? పాపిగాడి పెల్లానికి పర్నేదు. అంటది దుక్కముక్కనాగో, పిక్కనాగో, వుంటాదని కాదు- ముష్టి నాకొడుకులు, ఇయ్యాల్లో రేపో సచ్చీ సజ్జులోనే వుంటారుగాని - దుక్కపోతుల్నాగా బలిసుంటా రేటి ! ఒటేలు పొప్పరయిటర్లు, సారాకొట్టు సావుకోర్లు,కిరాని కొట్టు కోవిటోళ్లు, పోలిసిబిన్సి పెట్టర్లు - మరాల్లకి బోల్డు సంపాదన, నిత్తెవూ పూరాగ తిండీ వుంటాయి గనక ఆళ్లు జబరుగుంటారు గాని ముష్టోల్లకేటి? ఇదిగీ పూట నాన్తిని తీర్తాను- పలానక్కడ నాకు తిండి దొరుకుద్ది - అల్లా కలిగిన మారాజు నాకీపూట గెంజిపోస్తాడు- అనే ముష్టి నంజికొడుకేనా గుండిమీస్సెయ్యేసి నిబ్బరంగ సెప్పుకో గల్డేటి?

మరందల పాపిగాడ్నాటి సచ్చుముండాకొడుక్కి యిలాటప్పుడు మరీ కిష్టివ్. ఏలంటే ఆడికి దగ్గు జబ్బు కదా! జబ్బులు ముష్టోళ్లక్కాకపోతే మారాజుల్కొస్తా యేటి! ఒక్కోపాలి మారాజుల్కి జబ్బు,జొరం వొచ్చినా- సూడ్నానికి ఆసుపత్తుర్లున్నాయి- పెద్ద పెద్ద డాట్టర్లున్నారు-సిలక పిట్టల్లాంటి నర్సుగుంటలుంటారు-మరాల్లకి కష్టివ్ తెలుస్తాదంటావేటి! కష్టివల్లా బీదా బిక్కీకే. ఈల్ల కొంటికొస్తే సూసి దాతెవుడు!

అయితింతకి పాపిగాడికి దగ్గుకదా- ఆడు పుల్ల(రాలి పోయిన సీపురుకట్టనాగ సన్నంగ సచ్చిపోనానికి తయారై కూకున్నాడు. ఆడి కాల్లూ, సేతులూ సూత్తప్పటి కెలాటోడికేనా బయం పుట్టుకొస్తాది. అయితాడలాగే బతుక్కొస్తాన్నాడు. ఓ పక్కలెల్లి దగ్గి దగ్గి సస్తూనే, మరో పక్కలెల్లి గుమ్మాలంటెల్లడుక్కుంటాడు. నడ్నేక యెక్కడి కక్కడే సతికిలబడిపోతుంటాడు. డబ్బున్న

మారాజులూ, యిళ్లూ వాకళ్లున్న కావందులూ ఆడ్ని కుక్కన్తరివీసినట్టు తరివీస్తుంటురు. ఆడి దుక్కుసూసే తప్పటికి ఎవులికేనా మరలాటి బుద్దే పుడతాది- కుక్కలూ పందులూ ఎనాగో- ముష్టోళ్లు కూడా అనాగే కదా!

మరి కుక్కలికీ, ముష్టోళ్లకీ, పందులకీ తేడా లేదని తెల్దేటి మనుసులికి? రాతిర్తొమ్మిదేసినాక - గౌరి సెంకరు వుటేలు కాడి కెవులొచ్చినా తెలిసిపోద్ది సంగతి. వుటేలుకి కసింత వోరసేసి సిమెంటు గొట్టాం యెట్టినారు గదా పంచాతోళ్లు ఎంగిలాకులేస్కొనానికి. దాని సుట్టూ కుక్కలూ, పందులు,ముష్టోళ్లూ కాసుక్కూకోరా!ఎంగిలాకులందల పడీతప్పటికి ఎలాటి జట్టీల్నెగుస్తా యెరికా? సూడాల, సూసినోళ్లకే తెలుస్తాది.

మరీ వోనా, సలీ - యీటితో అడుగెయ్యనేకపోనాడు పాపిగాడు. అసలే దగ్గు. అందల మూడ్రోల బట్టి పట్టెడు మెతుకులు గాని, బుక్కెడు గెంజిగాని ఆడి నోటికాడికి రానేదు. దెబ్బకి మనిసి దివాలయిపోన్డు. పెల్లాంమీద కారాల్మిరియాల్నూర్తన్నాడు-"నంజా, నాకేటి ఒట్టుకు రాకంట, నివ్వే తినేస్తన్నావే నంజా" - అని. అయితే ఆ నంజకేటి దొరికి సచ్చింది! దాని పనీ పస్తే ! అయితే నిన్నరాత్తిరి గావాల- వోనయినా సిమెంటు గొట్టంల దిగి సూత్తప్పటికి - ఒక్క రవ్వ పచ్చడి పిసర్తో అంటాకు ముక్క దొరికింది. తొలాకుని కసిపిసి నవిలీసి, ఆ యెనక పచ్చడి నాలిక్కి రాసుకుంది - అంతా దానికి దొరికిన్తిండి. అలాటప్పుడు అదేటి తెచ్చిపెట్టగల్దు ఈడికి - ఓ పక్కలెల్లి దాని కడుపే మలవల మడిపోతంటే! అయితాడముండ, అందల ముష్టిముండ, ఏ నంజ సచ్చిన్దేవుడ్ని తిట్టగల్దు, తడితే మాతరం ఏటేనొస్తాదేటి! డబ్బునోళ్లయితే కొబ్బరి కాయిలూ, అరటిపల్లూ, యింకా యేటేటో దేవుడికిస్తార్గనక- దేవుడు కూడా ఆల్లకే అన్నీ యిస్తాడు. ముష్టోల్లేటివ్వగల్రు- మరందుకే దేవుడి క్కూడా ఆల్లంటే మంట- కడుపు కాలి సావంఢ్రా నా కొడకల్లారా అని సేపం యెట్టేసినాడు.

"నా కేటి దొరికిందిరా దగ్గు నంజికొడుకా నీ కెట్టనానికి" అని పాపిగాడ్ని ఆడి పెల్లాం గసిరింది. ఆడసలే ఎర్రెత్తి పోయున్నాడేవో- బూతులకి తగులుకున్నాడు. సీసీ గౌరీ సెంకరు వొటేల్లెల్లి పెద్దా సిన్నా పలారాలు సేసొస్తన్నారు- పెకాసంబాబు బేందీకొట్టులెల్లి బుడ్డీ లొట్టుకొని బాబులెల్తన్నారు- ఆల్లకి సికాకెయ్యదేటి యీడి బూతులింటుంటే ? సూస్సూసి- ఓ పెద్ద కవీజుబాబు సికాకేసి గావాల- వుటేలు పొప్పరయిటర్ని కేకలేసినాడు- "ఏటయ్య మమ్మల్ని సరిగా తిన్నియ్యవేటి నీ వోటేల్ల" అని. దాంతోటా అయ్యరుబాబు ఎర్రెత్తిపోన్డు. ఓ బెంచీ కాడ కూకు ని టీ తాగుతున్న కనిస్టీపులు కేటి సెప్పి నాడో తెల్దుగాని, ఆ బాబు నాటీ ఒట్టుకొని పాపిగాడి మీదికీ, ఆడి పెల్లాం మీదికీ పారొచ్చినాడు- " ఏట్రా నంజికొడకా- యీ కొట్టు కాడ్నుండి పోతారా, సంపీ మన్నారా" అని.

పాపిగాడి పెల్లాం " బాబ్బాబు-వోన- సచ్చిపోతన్నాం జవాను బాబూ- మూడ్రోల పొద్దయింది,

ఒక్క కవళం దొరకనేదు- ఒల్లల్లా తడిసిపోయి సలికి సచ్చిపోతన్నాం- యీ బంగారం సావుకోరు బేక్కాట్టుకట్టీసినాడు గనక యీ అరుగుమీద కూకోనానికేనా కసింత జాగా దొరికింది. బాబ్బాబు- మమ్మల్నెంట పెట్టీకు బాబు! సచ్చిపోతాం - ఆ జబ్బు నంజికొడుక్కి బుద్దినేక- పెద్దోలు మసిలీ జాగా అని తెలక- నోటికొచ్చినట్టు పేల్తన్నాడు. ఈ వొక్కాపాలీ మమ్మల్ని రచ్చించుబాబూ" అని జవాను కాల్లట్టుకుంది. అయితే-కనికారాలుంటే పోలీసుద్దోగంసేసినట్టే! లాటీ సూపించి అల్నక్కడిండి తరిపీసినాడు.

బిక్కనచ్చిపోయిన పాపిగాడు-" ఎలిపోతాం బాబూ- నంపేస్తాఁవంటూం టే ఎలిపోకుండుండి పోతావేటి! మీ దెబ్బల్తిని సచ్చిపోనావని నిష్టూరం మీకేల బాబూ- వోన్ల తడిసచ్చినాడన్నమాట మాకే వుండ్నియ్యండి" అనీసి వోన్నోకెల్లిపోనాడు- కాల్లీడ్సుకుంటు. అయితాడికి నడ్డానికి సత్తువున్నాదేటి? నాలుగడుగులేసి మర్నడ్నేక దబుక్కున సతికిలబడిపోన్డు. ఆడ్ని నెగదియ్యాలని సూసిందాడి పెల్లాం-గానీ మరో మనిసిన్నెగదియ్యానికి- దాని కేటి సత్తున్నుండిపోతంది. ఇంతల రంయ్యిమని పెద్దజల్లు పారొచ్చినాది. " మెల్లిగా డేకురుకొని పాఁరారా యీ తడిక్కిందకి " అని ఓ కేకెట్టేసి- ఆ యాడముండ పువ్వులకొట్టోడు ఎండతగలకంట పందిర్లాగ కట్టిన తడిక్కిందికి పారిపోనది. మొగుడొస్తన్నాడు గావాల అని సూస్తానే వుంది గాని - ఆడ్డానేదు. ఓ గంటగ్గావాల ఓన తగ్గినాక- ఏ అరుగుమీదకి సేరుకున్నాడో సూత్తుఁవని యిది బయలెల్లింది. ఆడే యరుగూ సేర్నేదు- రోడ్డు మద్దినే పడిపోయున్నాడు. ఇది కదిపి సూసింది- సచ్చిపోయున్నాడు.

మన్నాడు పంచాతోళ్లకి బోల్డు పన్తగిలింది. ఈ వోనకి సచ్చిపోయిన రెండు గేదపెయ్యల్ని, ఓ కుక్కని, యీ పాపిగాడ్ని ఒకేపాలి బండ్లేసి- దూరంగట్టికెల్లిపోయి జల్లీసినారు.

11-3-1988 ఆంధ్రజ్యోతి

✪✪✪